క్లుప్తంగా

నిరుపేద విద్యార్థికి అండగా విద్యా ఫౌండేషన్



దత్తత తీసుకుంటున్న ఫౌండేషన్ సభ్యులు

చొప్పదండి: మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందడంతో అనాథగా మారిన బాలికకు చొప్పదండికి చెందిన విద్యా ఫౌండేషన్ అండగా నిలిచింది. పట్టణానికి చెందిన ఒకటో వార్డులో నివసించే బీనవేని అంజి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో చిన్న కుమార్తె అవనిత అనాథగా మారిందని ప్రతినిధులు అమ్మాయి చదువుకయ్యే ఖర్చును భరించడానికి ముందుకువచ్చారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే ముగ్గురిని దత్తత తీసుకున్నామని, మరో బాలికను దత్తత తీసుకొని ఆపన్న హస్తం అందిస్తున్నామని ఆదివారం బాలికను కలిసి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పచ్చునూరి తిరుపతి, సభ్యులు కటుకం నారాయణ, దాసరి మునీందర్, పైడ మహేశ్, వల్లాల జగన్, మహేశుని మల్లేశం, బొద్దుల వెంకటేశం, దాతలు కొంజర్ల రవీందర్, కొత్త శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత



క్రీడా పరికరాలు అందజేస్తున్న జీవీఆర్

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు ఆదివారం తన నివాసంలో క్రీడా వస్తువులు, పరికరాలు అందజేశారు. శ్రద్ధతో చదువుకొని ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు.

ఇల్లందకుంట కళాకారుల కమిటీ అధ్యక్షుడిగా రవీందర్



రవీందర్‌ను సన్మానిస్తున్న కళాకారులు

ఇల్లందకుంట: తెలంగాణ రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా మండల కళాకారుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోదూరి రవీందర్, ఉపాధ్యక్షుడిగా అప్పాల రమేశ్, ప్రధానకార్యదర్శిగా తిరుపతిగౌడ్, సహాయకార్యదర్శిగా గురకుంట్ల సాంబయ్య, కోశాధికారిగా దేవేందర్‌రెడ్డి, జిల్లా డైరెక్టర్‌గా బండి మల్లయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అలివేలి సమ్మిరెడ్డి, నలగొని రమేశ్, రాంచంద్రారెడ్డి, పర్శరాములు, రాజ్‌కుమార్, వివిధ గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాజాపల్లి గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో యువశక్తి యూత్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ భగీరథ్, వైద్య సిబ్బంది బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువశక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మునిగాల అశోక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్ నుంచి రాంచంద్రాపూర్ వెళ్లే దారిలో రోడ్డుపక్కనే వ్యవసాయబావి ఉంది. నిత్యం చాలా మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి పక్కనే ఉన్న బావికి రక్షణ గోడ నిర్మించాలని, లేదా సూచిక బోర్డునైనా ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా?

- ప్రమాదకరంగా స్త్రీశక్తి, ఉపాధి హామీ భవనం
- కుంగిన ఫ్లోర్, పగుళ్లు చూపిన గోడలు
- భవనంలోకి పాములు, తేళ్లు
- మరుగుదొడ్లు లేవు.. నీటి సరఫరా లేదు
- ఏళ్లుగా పట్టించుకోని అధికారులు..పాలకులు



గదుల్లో కుంగిన నేల



నెర్రెలు బారిన భవనం గోడలు

సైదాపూర్: ప్రతి రోజు సంఘాల సమావేశాలు, వివిధ కార్యక్రమాలతో నిత్యం రద్దీగా ఉండే స్త్రీ శక్తి, ఉపాధి హామీ పథకం భవనం ఏళ్ల క్రితమే శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ప్రమాదం పొంచి ఉందని పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ప్రాణాలు పోతెనే పట్టించుకుంటారా? అని సిబ్బంది, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరా క్రాంతి పథం ద్వారా స్త్రీలు ఆర్థిక సాధికారత సాధించాలని లక్షాధికారులు, కోటీశ్వరులు కావాలని ప్రభుత్వాలు హామీలు ఇస్తాయి. కానీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడంలేదని మహిళా సంఘాల సభ్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఒక భవనం నిర్మిస్తే కనీసం 30 ఏళ్ల వరకు చెక్కు చెదరదు. కానీ సైదాపూర్‌లోని స్త్రీ శక్తి, ఉపాధి హామీ భవనం నిర్మించిన ఏడాదికే శిథిలావస్థకు చేరింది. భవనం నిర్మించి ఎనిమదేళ్ల క్రితం పూర్తి కాగా.. గోడలు పగుళ్లు బారాయి, ఫ్లోర్ కుంగి ప్రమాదకరంగా తయారైంది. భవనంలోకి తేళ్లు, పాములు వస్తుండగా.. అక్కడి సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమంటూ కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించాలని మండల సమాఖ్య మహిళలు కోరుతున్నారు.

రూ.32 లక్షల నిధులతో..

ఐకేపీ, ఉపాధి హామీ విభాగాలకు కలిపి సైదాపూర్‌లో 2011లో రూ.32లక్షల నిధులతో అప్పటి ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మండల కాంప్లెక్స్‌లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2016 నవంబర్ 26న అప్పటి మంత్రి, ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ భవనాన్ని ప్రారంభించారు. అప్పటి వరకు అద్దె భవనంలో సాగిన కార్యాలయాలు సొంత భవనంలోకి వెళ్లాయి. ఆ సంతోషం మూణ్నాళ్లు కూడా మిగల్లేదు. కాంట్రాక్టరు, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభించిన ఏడాదికే భవనంలోని ఫ్లోర్ కుంగింది.

భవనం ప్రారంభించిన పదినెలలకే గోడలు పగుళ్లు బారాయి. భవనానికి కిటికీలు, తలుపులు సరిగా లేవు. దీంతో పాములు, తేళ్లు వస్తున్నాయని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఐకేపీ కార్యాలయంలో వరండాతో పాటు గదుల్లో ఫ్లోర్ కుంగి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం మహిళలతో సభలు, సమావేశాలు నిర్వహించే భవనం ప్రమాదకరంగా మారిందని, ఫ్లోర్ సరిగా లేక జారి పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనంలో నీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేవు. ఐకేపీలో 26 గ్రామ పంచాయతీల్లో 33 గ్రామైఖ్య సంఘాలు, మండలంలో 700 పైగా స్వశక్తి మహిళా సంఘాలున్నాయి. సుమారు తొమ్మిదివేల మంది సభ్యులు కొనసాగుతున్నారు. వీరికి ప్రతీనెలా ఈ కార్యాలయంలో సంఘాల ఆర్థిక లావాదేవీలపై సమావేశాలు జరుగుతాయి. మరుగుదొడ్డి ఉన్నా నీటి సౌకర్యం లేదని బోరు వేయాలని సమావేశాలకు వచ్చే మహిళలు కోరుతున్నారు. మంచినీటి సౌకర్యం కూడా లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు భవనానికి మరమ్మతు చేయించాలని, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నారు

కార్యాలయానికి నీటిసౌకర్యం లేదు. ఒక బోర్ మోటర్ ఏర్పాటు చేయాలి. నీటి సరఫరా లేక పోవడంతో మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది. ప్రతీనెలా సమావేశాలకు వచ్చిన మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయంలోని అన్ని గదుల్లో ఫ్లోర్ కుగింది. గోడలు పగుళ్లబారాయి. అధికారులు, పాలకులు స్పందించి భవనానికి మరమ్మతు పనులు చేపట్టాలి.

– చెన్నబోయిన కుమారస్వామి, ఐకేపీ ఏపీఎం సైదాపూర్

నేడు క్రీడాకారుల ఎంపిక పోటీలు

రామడుగు: మండల కేంద్రంలో సోమవారం మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గో తరగతి చదువుతున్నవారిలో 20 మందిని ఎంపిక చేస్తామని విద్యార్థులు 01-09-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించి ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలకు చెందినవారై ఉండాలన్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్, తదితర పోటీలను నిర్వహిస్తామని వివరాలకు పీడీలు దత్తాత్రి 9849976087, రూప 9490861264 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన నాయకులు

రామడుగు: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల మృతి చెందగా మండలానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యేను పరామర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ కు చెందిన నాయకులతో పాటు రామడుగు మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గొల్లె రామస్వామి ఆధ్వర్యంలో సభ్యులు పరామర్శించిన వారిలో ఉన్నారు. రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

వంతెన నిర్మించాలి

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామ ఊర చెరువు వద్ద ప్రధాన రహదారిపై ఉన్న అండర్ బ్రిడ్జి శిథిలావస్థలో ఉందని ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో కురిసిన వర్షాలకు అండర్ బ్రిడ్జి ఓ వైపు కూలిందని, అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడంలేదని తెలిపారు. దారి మీదుగా జమ్మికుంట, కరీంనగర్‌కు వాహనాలు వెళ్తుంటాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



చొప్పదండి: నెత్తిన పోచమ్మ బోనాలతో తరలివెళ్తున్న మహిళలు



మానకొండూర్: అన్నారంలో పోచమ్మ బోనాలు

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లీ జాతరలో బాగంగా ముందుగా ఆదివారం పోచమ్మ బోనాలు చేశారు. మహిళలు బోనాలతో డప్పు, డీజే చప్పుళ్ల మధ్య పోచమ్మ తల్లీ ఆలయానికి చేరుకుని తమ పిల్లా పాపలు చల్లంగ ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు.

చొప్పదండి: పట్టణంలోని మాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోణాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ బద్దంగా ఏకరూప దుస్తులు ధరించిన మహిళలు బోణాలను నెత్తిన ఎత్తుకొని వేప రెమ్మలు, పసుపు, కుంకుమలతో అలంకరించి బైండ్ల పూజారులు, డప్పు సప్పుడులతో పోచమ్మ ఆలయానికి తరలివెళ్ళి మొక్కులు సమర్పించారు. గొల్లపల్లి మోహన్ భాగ్య దంపతుల ఇంటి నుండి బోణాలను తరలించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో గన్నేరువరం ప్రభుత్వ పాఠశాల 2007-08 పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 2003–04 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఎవరికి ఆపదవచ్చినా ఒకరికొకరూ సాయం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు బత్తిని శ్రీకాంగ్‌గౌడ్, అన్నబోయిన సనత్, రాజేంద్రప్రసాద్, కూతురు రాజు, వరుకోలు సంతోష్, ఠాకూర్ జితేందర్‌సింగ్, పాలవేణి సంపత్, కనగండ్ల సతీష్, బొల్లి రాజు, పెండ్యాల రాజు, కాత శ్రీను, అందె శ్రీను, అన్నబోయిన భాను, గడ్డం వెంకట్ పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007–08 పదో తరగతి విద్యార్థులు గన్నేరువరంలోని కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కారించారు.



చిగురుమామిడి మండలం నవాబుపేట్‌లో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

మూఢనమ్మకాలను పారదోలాలి



కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న ఎండీ ఖాజాబీ

హుజూరాబాద్‌రూరల్: సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బాలవికాస సెంటర్ మేనేజర్ ఎండీ ఖాజాబీ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం నిర్వహించారు. వితంతువు వివక్షత, మూఢ నమ్మకాలను పారద్రోలాలన్నారు. హుజూరాబాద్ ఏరియా మానవ హక్కుల సంఘం కమిటీ అధ్యక్షురాడు లతారెడ్డి, బాలవికాస కో ఆర్డినేటర్స్ లీలా, రజిత, మేకల మౌనిక, పింగిళి విజయ, బాలవికాస మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి సాధన కమిటీ అధ్యక్షుడిగా జగన్మోహన్



జగన్మోహన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

గన్నేరువరం: బ్రిడ్జి సాధన కమిటీ అధ్యక్షుడిగా పుల్లెల జగన్మోహన్‌ను ఎన్నుకున్నామని సభ్యులు తెలిపారు. ఆదివారం గన్నేరువరంలో సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని మండలకేంద్రం నుంచి కరీంనగర్ వరకు మానేరుపై బ్రిడ్జి నిర్మాణానికి నిరంతర పోరాటం చేయనున్నామని పేర్కొన్నారు. అనంతరం అధ్యక్షుడిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కయ్యం సంపత్‌కుమార్, పుల్లెల రాము, దొగ్గలి వెంకటేష్, జీల కుమార్‌యాదవ్, గర్శకుర్తి ప్రవీణ్, ఇతరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి జేఏసీ 2013లో ఏర్పాటు



మాట్లాడుతున్న సంపతి ఉదయ్‌కుమార్

మానేరుపై బ్రిడ్జి నిర్మాణం కోసం 2013లో బ్రిడ్జి సాధన కమిటీ ఏర్పాటు చేసి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినట్టు కమిటీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మాదాపూర్‌లో గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. బ్రిడ్జి ఏర్పాటే లక్ష్యంగా ఉమ్మడి బెజ్జంకి మండలం నుంచి 11 ఏళ్లుగా అందరి సహకారంతో పోరాటం చేస్తున్నామని, బ్రిడ్జి అంశాన్ని వెలుగులోకి తెచ్చానని పేర్కొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: బీజేపీ నాయకులు ఆదివారం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు స్వర్గీయ డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు పల్లపు రవి, ఠాగూర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: శ్యాంప్రసాద్‌ముఖర్జీ భరతజాతికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆయన చిత్రపటానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1951లో జనసంఘ్ పార్టీని స్థాపించారని, దేశంలో ఒకే చట్టం ఒకే జెండా ఉండాలనిప్రగాఢంగా విశ్వసించేవాడని పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం ఈదురుగాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పక్కన రేకుల పందిరి కూలిపోయింది. సమీపంలో ఉన్న విద్యుత్‌తీగలపై చెట్టు పడితే ఇబ్బంది పడేవాళ్లమని స్థానికులన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నవాబుపేటలో సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేటలో కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు, కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆదివారం బస్టాండ్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్ మాట్లాడారు. రాష్ట్ర కేబినేట్‌లో రుణమాఫీపై ఆమోదం తెలపడం, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహూల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, కిసాన్‌సెల్ మండలశాఖ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, సోషల్ మీడియా మండల కన్వీనర్ వేణుగోపాల్, నాయకులు రాణాప్రతాప్‌సింగ్, మాజీ సర్పంచ్ ప్రవీణ్, బోయిని దుర్గయ్య, పిల్లి కొంరయ్య, నార్లపురం మల్లేశం, బోయిని వంశీకృష్ణ, కంది నాగరాజు, పిల్లి తిరుపతి, వరుకోలు సంతోష్ పాల్గొన్నారు.

✦ **గీత కార్మికుడికి గాయాలు**

ఇల్లందకుంట: తాటిచెట్టు పైనుంచి పడటంతో ఓ గీత కార్మికుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్యాలకు చెందిన బొమ్మ తిరుపతి ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారి కిందపడ్డాడు. కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వం, గౌడ కార్పొరేషన్ స్పందించి, బాధిత ఆర్థికసాయం అందించాలని సర్వాయి పాపన్న గీత పారిశ్రామిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మాటి రాజమౌళిగౌడ్, మండల అధ్యక్షుడు దేవేందర్ కోరారు.

✦ **కారు–బైక్ ఢీ**

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి గ్రామ శివారులో ఆదివారం కారు–బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో ప్రొక్లెయిన్ డ్రైవర్ ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వీణవంక మండలం మల్లన్నపల్లి గ్రామంలో పనిచేసి ఆదివారం సాయంత్రం బైక్‌పై మొలంగూర్‌వైపు వెళ్తుండగా వీణవంకకు వెల్తున్న కారు ఢీకొట్టింది. గాయాలైన ప్రవీణ్‌కు 108లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ



చిగురుమామిడి: టూరిస్ట్ బస్సును లారీ ఢీకొన్న ఘటన చిగురుమామిడి మండలంలోని సుందరగిరి శివారు క్రాసింగ్ వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. కరీంనగర్ నుంచి యాదాద్రికి వెళ్తున్న బస్సును హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టిందని ఎస్సై రాజేశ్ తెలిపారు. లారీడ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని, బస్సు ధ్వంసమైందన్నారు. ఈ ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని పేర్కొన్నారు. బస్సు డ్రైవర్ రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్ హేమంత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.